01ATP08FF_01ATP08FF.qxd 08-11-2022 PM 10:56 Page 1

అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
బుధవారం 09 నవంబర్ 2022 పేజీలు : 04

# రహదారి భద్రతకు సమగ్ర చర్యలు

**- జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి**




కార్యక్రమానికి హాజరైన అధికారులు, మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

**అనంతపురం కలెక్టరేట్, నవంబర్ 8 ప్రభాతవార్త**

జిల్లాలో రహదారి భద్రత కోసం సమగ్ర చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని మిని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎస్పి పక్కీరప్పలు జిల్లా రహదారి భద్రత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పని చేసినప్పుడే రోడ్ల మీద ప్రమాదాలు నివారించి ప్రాణాలు కాపాడగలమన్నారు. ముఖ్యంగా జిల్లాలో వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల మరమ్మత్తులను వేగంగా పూర్తి చేయాలన్నారు. నూతన రోడ్ల నిర్మాణ పనుల వల్ల పలు రోడ్లు ప్రమాదకరంగామారుతున్నాయన్నారు. జాతీయ రహదారులు, బ్రిడ్జిల నిర్మాణం కోసం తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రోడ్ల నిర్మాణం, నిర్వహణ సరిగా లేకపోవడం వల్ల ప్రయాణికులు ఇబ్బంది పడుతున్న ప్రాంతాలను 40 వరకు గుర్తించామన్నారు. రహదారులపై అనధికారికంగా ఏర్పాటు చేస్తున్న డివైడర్ ఓపెనింగ్‌లను ఎప్పటికప్పుడు మూసివేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో యాక్సిడెంట్లు కారణంగా అత్యవసర వైద్యం కోసం వచ్చే వారికి సరైన సమయంలో చికిత్స అందడం లేదని ఫిర్యాదులు అందుతున్నందున అత్యవసర సేవల కౌంటర్ వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. రహదారి భద్రత కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఐరాడ్ వెబ్ సైట్‌లో ఎప్పటికప్పుడు రోడ్డు ప్రమాదాల క్షతగాత్రుల, మృతుల వివరాలు నమోదు చేయాలని వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. ఐరాడ్ యాప్‌లోని సమాచారం ఆధారంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని రవాణా శాఖ అధికారులను ఆదేశించారు. నగరంలో పశువులు ఇష్టం వచ్చినట్టు తిరగకుండా చూడాల్సిన బాధ్యత మున్సిపల్ కమిషనర్‌పైనే ఉందన్నారు. అవసరమైతే పశుపెంపకం దారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిటిసి శివరామప్రసాద్, రోడ్డు భవనాల శాఖ ఎస్ఈ ఓబుల్‌రెడ్డి, డిఎంహెచ్ఓ విశ్వనాథయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# జే అంటే జోకర్..! సీ అంటే కామెడీ..!

**- జేసీకి భాష్యం చెప్పిన ఎమ్మెల్యే పెద్దారెడ్డి - అధికారులు, వ్యవస్థలపై గౌరవం లేని వ్యక్తి జేసీ అంటూ విమర్శలు**



పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి

**తాడిపత్రి, ప్రభాతవార్త**

జేసీ అంటే ఓ బ్రాండ్ కాదని జే అంటే జోకర్..సీ అంటే కామెడీ అనేలా జేసీ ప్రభాకర్‌రెడ్డి పరిస్థితి తయారయిందని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కొత్త భాష్యం చెప్పారు. జిల్లా కలెక్టర్ నాగలక్ష్మితో సోమవారం స్పందన కార్యక్రమంలో తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి వ్యవహరించిన తీరుపై ఎమ్మెల్యే మంగళవారం స్పందించారు. వ్యవస్థలన్నా..అధికారులన్నా జేసీ ప్రభాకర్‌రెడ్డికి గౌరవం లేదని, అధికారులను భయభ్రాంతులకు గురిచేసి వ్యవస్థలను తమ అదుపులో ఉంచుకోవాలని చూసే సంస్కృతి అతనిదని ఎమ్మెల్యే విమర్శించారు. జిల్లా పాలనాధికారితో ఎలా ప్రవర్తించాలో తెలియని వ్యక్తి 30 ఏళ్లకు పైగా ప్రజా జీవితంలో ఎలా మనుగడ సాగించాడో అర్థం కావడం లేదని జేసీనుద్దేశించి పేర్కొన్నారు. సోమవారం నాటి జేసీ ప్రవర్తనను చూసి జిల్లా అధికార యంత్రాంగం నివ్వెర పోతోందని, జిల్లా కలెక్టర్ సివిల్ సర్వీసుకు సరిపోదని జేసీ వ్యాఖ్యానించడం అతనికి ఇంగితజ్ఞానం లేదనడానికి నిదర్శనమని ఆయన అన్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడే వ్యవస్థలను అపహాస్యం చేసేలా తాడిపత్రి పోలీసు స్టేషన్‌కు తాళాలు వేసిన సంస్కృతి వారిదని ఆయన ఎద్దేవా చేశారు. జేసీ ప్రభాకర్‌రెడ్డిని ఎదుర్కొనే దమ్ము, ధైర్యం ఎమ్మెల్యేకు ఉందా అంటూ ఓ తెదేపా కౌన్సిలర్ ఇటీవల వ్యాఖ్యానించిందని, తన గతాన్ని గురించి తెలుసుకుంటే నా దమ్మును తట్టుకునే ధైర్యం వారికే లేదని తెలుస్తుందని చెప్పారు. తాడిపత్రి ప్రజల ప్రశాంతతను కోరుకుంటున్నాను కాబట్టే ఎమ్మెల్యే హోదాలో హుందాగా వ్యవహరిస్తున్నానని, ఎమ్మెల్యే పదవిని పక్కన పెడితే తన దమ్మేంటో చూపించి నిద్ర లేకుండా చేయగలనని ఆయన పేర్కొన్నారు. ప్రజల్లో మార్పు వచ్చిందనే విషయాన్ని జీర్ణించుకోలేక వారిని కలుపుకొని పోవాలనే ఆలోచనతో జేసీ తన ఉనికిని చాటుకోవాలనే ప్రయత్నం చేస్తున్నాడు తప్ప మరొకటి కాదని ఎమ్మెల్యే విమర్శించారు. వ్యవస్థల పనితీరు గురించి అధికారులకు చెప్పేంత మేధావి కాదని, పార్టీ ఉనికి కోసం కొందరు పార్టీ సానుభూతి పరులు చెప్పే మాటలు విని అపహాస్యం పాలవుతున్నాడని జేసీని విమర్శించారు. అధికారులను బెదిరింపులకు గురి చేయడం, ఎదుటి వారిని రెచ్చగొట్టడం వంటి చర్యలు జేసీ మానుకోక పోతే ప్రజలు మరోసారి బుద్ధి చెప్పే సందర్భం త్వరలోనే వస్తుందని ఆయన అన్నారు. మున్సిపల్ చైర్మన్‌గా గెలిచావంటే అది నీ సమర్థత కాదని, మా పార్టీలోని కొందరి దయా దాక్షిణ్యాలతోనే నీవు నెగ్గగలిగావనే విషయం నీకు కూడా తెలుసని జేసీనుద్దేశించి ఆయన పేర్కొన్నారు. నాకు చదువు తక్కువైనా వ్యవస్థలను, ప్రజలను గౌరవించే సంస్కారం తనకు పుష్కలంగా ఉందని ఎమ్మెల్యే వివరించారు.

# దేశంలో మూడోవంతు అడవి ఉంటేనే పర్యావరణం సమతుల్యం

**- శ్రీసత్యసాయి జిల్లాను గ్రీన్ జిల్లాగా తీర్చిదిద్దడానికి ప్రణాళికలు రూపొందించండి: కలెక్టర్ బసంత్‌కుమార్**



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్

**శ్రీసత్యసాయిజిల్లా, నవంబర్ 08, ప్రభాతవార్త ప్రతినిధి:**

ప్రపంచ వ్యాప్తంగా మూడొంతుల మేర ఆడవులు ఉన్నాయని, ఈ క్రమంలో 80 శాతం జీవవైవిధ్యం అడవులలోనే ఉండడంతో ఏ దేశానికి ఆ దేశం కూడా తమ భూ భాగంలో మూడోవంతు అడవి ఉంటేనే పర్యావరణ సమతుల్యం సాధ్యమౌతుందని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నట్లు శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్ తెలియజేశారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలు నందు ఉద్యానవన శాఖ మరియు సోషల్ ఫారెస్ట్ ఆధ్వర్యంలో ఆబోయే రెండు నెలల కాలంలో సుమారు లక్ష మొక్కలు నాటడంపై జిల్లాలోని సంబంధిత అధికారులు వివిధ స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు, సత్యసాయి ట్రస్ట్ ప్రతినిధులు, ఆర్‌డిటి, బ్రహ్మకుమారీ సంస్థ, ఎస్‌కె యూనివర్శిటీ హార్టికల్చర్ యూనివర్శిటీ ఇతర విద్యా సంస్థల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, శ్రీసత్యసాయి జిల్లాను గ్రీన్ జిల్లాగా తీర్చిదిద్దాడానికి విరివిగా మొక్కలు నాటే కార్యక్రమాల కార్యాచరణ ప్రణాళికలు అమలు చేయాలని సంబంధిత అధికారులను సూచించారు. మ జిల్లాలో అటవీ విస్తీర్ణం సుమారు 14% ఉందని,

మిగతా 4లో...

# ఆ సమయంలోనే గెజిటెడ్ ఆఫీసర్ కావాలనుకున్నా...!

**- మొదట నుంచి సిఏ చేద్దామనుకున్నాను**
**- ఐఏఎస్ కోచింగ్ తీసుకుంటుండగానే ఎక్సైజ్ ఎస్ఐ ఉద్యోగం వచ్చింది**
**- ఏబీసీడబ్ల్యూవో ఉద్యోగానికి ఎంపికైన తర్వాత ఎస్ఐ ఉద్యోగం మానేశాను**
**- వార్త ఇంటార్వ్యూలో అనంతపురం జిల్లా బీసీ వేల్ఫేర్ డీడీ ఖుష్బూ కొటారి**



**అనంతపురం న్యూటౌన్, నవంబర్ 8 ప్రభాతవార్త**

ఆ సమయంలోనే తాను గెజిటెడ్ ఆఫీసర్ కావాలనుకున్నాను. మొదటి నుంచి సిఏ చేద్దామనుకుంటే...ఒక ఆంకుల్ సూచనతో ఐఏఎస్‌కి కోచింగ్ తీసుకుంటుండగానే ఎక్సైజ్ ఎస్ఐ ఉద్యోగానికి ఎంపికైయ్యాను. ఆ తర్వాత ఏబీసీడబ్ల్యూవో ఉద్యోగానికి ఎంపికైన తర్వాత ఆ ఎస్ఐ ఉద్యోగం మానేశానని వార్తకు ఇచ్చిన ప్రత్యేక ఇంటార్వ్యూలో అనంతపురం జిల్లా బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఖుష్బూ కొఠారి తెలిపారు.

.ప్రశ్నః మేడమ్ మీ సొంత ఊరు ఏది?

జవాబుః నేను పుట్టి పెరిగింది అంతా విజయవాడలోనే. మా అమ్మ నాన్న నా చిన్నప్పుడే రాజస్థాన్ నుంచి విజయవాడకు వచ్చి స్థిరపడ్డారు.

ప్రశ్నః మేడమ్ మీరు ఎక్కడ చదువుకున్నారు?

జవాబుః విజయవాడలోని రాజస్థాన్ ఇంగ్లీష్ మీడియం ఎయిడెడ్ స్కూల్లో 1వ తరగతి నుంచి పదో తరగతి వరకు, ఇంటర్ నుంచి డిగ్రీ వరకు స్టెల్లా కళాశాలలో చదువుకోవడం జరిగింది.

ప్రశ్నః మేడమ్ మీకు చిన్నప్పటి నుంచి ఏమైనా లక్ష్యం ఉందా?

జవాబుః నేను కాలేజ్‌లో చదువుతున్నప్పుడు గెజిటెడ్ ఆఫీసర్లు తనిఖీలకు వచ్చేవారు. ఆ సమయంతోనే తాను కూడా గెజిటెడ్ ఆఫీసర్ కావాలని అప్పటి నుంచి లక్ష్యం పెట్టుకున్నాను. డిగ్రీ పూర్తి

మిగతా 4లో...

# శరవేగంగా కియా కార్ల ఉత్పత్తులు



**- గంటకు 45 కార్ల ఉత్పత్తి**
**- 92 దేశాలకు ఇక్కడి నుంచే ఎగుమతి**
**- భారత్‌లో కార్ల ఉత్పత్తిలో 5వ స్థానాన్ని ఆక్రమించిన కియా**
**- రానున్న రోజుల్లో ఎలక్ట్రానిక్స్ వెహికల్స్ తయారీ రంగంలోకి**

**అనంతపురం, నవంబర్ 8 ప్రభాతవార్త బ్యూరో**

శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ సమీపంలోని యర్రమంచిలి వద్ద ఏర్పాటు చేసిన కియా కార్ల పరిశ్రమ ఉత్పత్తులు శరవేగంతో కొనసాగుతున్నాయి. అధునాథన టెక్నాలజీతో ఉత్పత్తి అవుతున్న కియాకార్లకు మార్కెట్‌లో డిమాండ్ ఎక్కువగాఉంది. కియా కార్ల పరిశ్రమ పెనుకొండ యూనిట్ భారతదేశంలోనే ఉత్పత్తుల్లో 5వ స్థానాన్ని ఆక్రమించింది. దీన్ని బట్టి ఉత్పత్తులు ఎలా కొనసాగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. గంటకు 45 కార్లు ఉత్పత్తి చేయాలన్న లక్ష్యంతో అధునాథన టెక్నాలజీతో మూడు షిప్టుల్లో సిబ్బంది పనిచేస్తూ కార్లఉత్పత్తిని కొనసాగిస్తున్నారు. అధునాథన రోబోట్స్‌ని కూడా కార్ల ఉత్పత్తిలో వినియోగిస్తూ ఉత్పత్తులు శరవేగంగా జరిగేందుకు కియా మోటార్స్ సంస్థచర్యలు తీసుకుంటోంది. కియా మోటారు సంస్థ 2015లో భారత్‌లో ఎక్కడ పరిశ్రమ పెట్టాలని గుజరాత్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్‌లలో సర్వే చేసింది. కియా పరిశ్రమ ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ముఖ్యంగా ఉమ్మడి అనంతపురం జిల్లా బాగుంటుందని 2017లో ఏపిప్రభుత్వంతో కియా మోటార్స్ సంస్థ ఒప్పందం చేసుకుంది. పెనుకొండ సమీపంలోని యర్రమంచిలి వద్ద కియా పరిశ్రమను ఏర్పాటు చేసింది. 2021 సంవత్సరం ఏప్రిల్ నుంచి కార్ల ఉత్పత్తిని ప్రారంభించింది. ఏడాదికి 3 లక్షల కార్లను ఉత్పత్తి చేయాలన్న లక్ష్యంగా పెట్టుకుని ఇప్పటి వరకు 5,82,797 కార్లను ఉత్పత్తి చేసింది. ఇందులో 1,62,303 కార్లను 92 దేశాలకు ఎగుమతి చేసింది. భారతదేశంలోనే కార్ల ఉత్పత్తిలో 5వ స్థానాన్ని ఆక్రమించిందంటే ఉత్పత్తి ఎలా కొనసాగుతుందో అర్థం చేసుకోవచ్చు. కియా కార్ల సంస్థ పెనుకొండ యూనిట్‌లో మొదటి సెల్టోస్ రకం కారును తయారుచేసి మార్కెట్‌లోకి విడుదలచేసింది. ఆ తర్వాత సొనైట్, కార్నివాల్ రకాలను తయారు చేసి మార్కెట్‌లోకి పంపింది. కొత్తగా కర్నెట్‌రకం కారును అధునాథన టెక్నాలజీతో మార్కెట్‌లోకి పంపింది. ఇప్పటివరకు నాలుగు రకాల (మోడల్స్)తో కియా పరిశ్రమ ఉత్పత్తి చేసి దేశ విదేశాలకు పంపింది. కర్నివాల్‌మోడల్ కార్లు మినహా అన్ని రకాల కార్లు అనంతపురం యూనిట్‌లో తయారు చేస్తున్నారు. కార్నివాల్ రకం కార్లు మాత్రం విడిభాగాలన్నీ దక్షిణ కొరియా దేశం నుంచి ఈ యూనిట్‌కు దిగుమతి అవుతున్నాయి. పెనుకొండ యూనిట్‌లోనే కార్నివాల్ కారుకు అసెంబుల్ చేస్తున్నారు. ఈవి-6 అనే ఎలక్ట్రానిక్ కారును ఇతర యూనిట్లలో తయారు చేసి ఇక్కడ మార్కెట్‌లోకి తీసుకురావాలని యోచిస్తోంది. కియా కార్ల పరిశ్రమకు ప్రపంచ వ్యాప్తంగా 15 యూనిట్లు ఉన్నాయి. ఇందులో కొరియాలోనే 8 యూనిట్లు ఉన్నాయి. 15వ యూనిట్‌గా అధునాథన టెక్నాలజీతో అనంతపురంలో ఏర్పాటు చేశారు. పెను కొండ యూనిట్‌లో అధునాథన టెక్నాలజీని వినియోగిస్తున్నారు. 246 రోబోట్స్‌తో కార్ల ఉత్పత్తి తయారు చేసే విధానాన్ని యూనిట్‌లో చూస్తే కళ్లు జిగేల్ మంటాయి. అధునాథన టెక్నాలజీ ఇంత ఉందా అని ఆశ్చర్యం కలుగుతుంది. కాగా పెనుకొండ సమీపంలోని యర్రమంచిలి వద్ద 535.5 ఎకరాలు కియా పరిశ్రమకు భూమి కేటాయించారు. ఇందులో 425.4ఎకరాలు కియా పరిశ్రమకు కాగా 110 ఎకరాలు కియా అనుబంధ పరిశ్రమలకు కేటాయించారు. కియాకు కేటాయించిన 425.4 ఎకరాల భూమిలో 60 నుంచి 70 ఎకరాల్లో మాత్రమే భవనాలు ఉన్నాయని, రాబోయే రోజుల్లో కియా పరిశ్రమ విస్తరించాలంటే మరిన్ని భవనాలు నిర్మించ వచ్చని కియా మోటార్స్ సంస్థ అధికారులు బల్లగుద్ది చెబుతున్నారు.

**కియాకు అనుబంధ పరిశ్రమలు కీలకం :**

శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ వద్ద ఏర్పాటు చేసిన కియా కార్ల ఉత్పత్తి కేంద్రానికి అనుబంధ పరిశ్రమలు కీలకమని చెప్పవచ్చు. అనుబంధ పరిశ్రమ ద్వారా విడిభాగాలు తయారు అవుతున్నాయి. విడి భాగాలు కొన్ని విదేశాల నుంచి మరికొన్ని మన దేశం నుంచి వస్తున్నాయి. కియా కార్ల పరిశ్రమకు 182 అనుబంధ పరిశ్రమలు ఉంటే.. ఇందులో 28 అనుబంధ పరిశ్రమలు విదేశాల్లోనే ఉన్నాయి. అందులో 151భారతదేశంలో ఉన్నాయని, అందులో 19 అనుబంధ పరిశ్రమలు అనంతపురం జిల్లాలో ఉండటం విశేషం. పెనుకొండలోని కియా కార్ల పరిశ్రమకు చుట్టూ అనుబంధ పరిశ్రమలు ఉండటం వల్ల ఉపాధి అవకాశాలు కూడా మెరుగవుతున్నాయి. పెనుకొండ కియా యూనిట్‌లోనూ, అనుబంధ పరిశ్రమల్లోనూ 20,131 మంది ఉద్యోగులు ఉన్నారని, ఇందులో 16,712 మంది ఉద్యోగులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారని కియా అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. కియా పరిశ్రమ ద్వారా వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని సంబంధిత అధికారులు చెబుతున్నారు. కరోనా వైరస్ వ్యాప్తి చెందినప్పుడు 2020లో సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.2కోట్లు ఇచ్చామని, 2022లో ఏపి డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కింద 5 కోట్ల రూపాయలు నిధులు కియా పరిశ్రమల ద్వారా ఇచ్చినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు.

# కలెక్టర్‌పై దురుసుగా ప్రవర్తించిన జె.సి ప్రభాకర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి

**- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి**



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

**తాడిప త్రిఅర్బన్, నవంబర్ 8 ప్రభాతవార్త**

అనంతపురం జిల్లా కలెక్టర్ నాగలక్ష్మిపై దురుసుగా ప్రవర్తించిన తాడిపత్రి మున్సిపల్‌చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారులపై రాజకీయ బలప్రయోగాలు చేయడం సరైందికాదన్నారు. ప్రజా స్వామ్యంలో ప్రజలందరూ సమానమే నన్నారు. కేవలం డబ్బు వుందన్న అహంకారంతో మహిళ అని కూడా చూడకుండా కలెక్టర్‌పై దురుసుగా ప్రవర్తించిన జె.సి ప్రభాకర్‌రెడ్డి మున్సిపల్‌చైర్మన్ పదవికి అనర్హుడన్నారు. జె.సి ప్రభాకర్‌రెడ్డిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని లేకుంటే ఏ ఉద్యోగి కూడా తమ విధులను సరైన పద్ధతిలో నిర్వర్తించలేరని బలమున్న వాడిదే రాజ్యం అవుతుందని, బలహీనులకు అండ ఎవరు వుంటారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మీరు నిష్పక్ష పాతంగా చట్టబద్ధంగా వ్యవహరించాలని, ఏ అధికారిని కూడా ఇలా బెదిరి స్తూ పోతే సమాజం ఏమికావాలన్నారు. మీకు ఎమ్మెల్యే పదవి పోయినప్పటి నుండి సహనం కోల్పోయి అధికారులను బెదిరిస్తున్నారన్నారు. కేవలం నీకు డబ్బు వుందన్న అహంకారం తప్పా ప్రజల మద్దతు నీకు లేదని అందుకే నిన్ను ఎమ్మెల్యేగా ప్రజలు ఓడిం చారన్నారు. ఇలాగే ప్రవర్తిస్తే ప్రజలు నీకు మళ్లీ బుద్ధి చెబుతారన్నారు. నీవు మారితే అంతో ఇంతో నిన్ను క్షమిస్తారని లేకుంటే భవిష్యత్తులో నీకు మరోమారు ప్రజలు గుణపాఠం చెబుతారని ఆ నమ్మకం నాకు వుంద న్నారు. ఎమ్మెల్యే మమ్ములను చూసి భయప డుతున్నారని ఒక కౌన్సిలర్ అంటున్నారని నేను ఏంటో నా చరిత్ర ఏమిటో మీకు తెలుసా నేను ఎమ్మెల్యేగా వున్నాను కాబట్టి మీరు ఆ మాట అనగలు గుతున్నారు ఎందుకంటే నేను ఒక ఎమ్మెల్యేగా ప్రజల చేత ఎన్నుకోబడ్డ ఒక ప్రజా ప్రతినిధిని కాబట్టి మీరు అనగలుగుతున్నారు లేకుంటే మీరు ఎక్కడ వుంటారో గుర్తు చేసు కోవాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి హితవు పలికారు.

# పార్టీ అధ్యక్ష పదవికి కాపు రాజీనామా



కాపు రామచంద్రారెడ్డి

**అనంతపురం, నవంబర్ 8 ప్రభాతవార్త బ్యూరో**

అనంతపురం జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి రాజీనామా చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే ఒక ప్రకటనలో ఇలా తెలియజేశారు. మా కుటుంబంలో జరిగిన విషాదం వల్ల జిల్లా స్థాయి కార్యక్రమాలపై ఎక్కువ శ్రద్ద పెట్టలేకపోతున్నాను. ఇలా రాయదుర్గం నియోజకవర్గంపై మరింత ఎక్కువ శ్రద్ధ పెట్టవలసిన అవసరం ఉన్నందున, వైఎస్ఆర్‌సిపి జిల్లా అధ్యక్షులుగా వేరే వారిని నియమించవలసిందిగా వైఎస్ఆర్‌సిపి జాతీయ అధ్యక్షులు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కోరడం జరిగింది. అందుకు వైఎస్ఆర్ కాంగ్రెస్‌ను పార్టీ అధ్యక్షులు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సమ్మతించడం జరిగింది. నాకు అనంతపురం జిల్లా అధ్యక్షులుగా ఈ మేరకు అవకాశం క్పించినందుకు ముఖ్యమంత్రి, వైఎస్ఆర్ కా ంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. నా కు అన్ని విధాలా సహాయం చేసి అండగా ఉన్నటువంటి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి హృదయ పూర్వక ధన్యవాదాలు, అనంతపురం జిల్లా అధ్యక్షులుగా ఉన్న సమయంలో నాకు సహాయ సహకారాలు అందించినందుకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులకు, కార్యకర్తలకు, అధికారులకు, జిల్లా ప్రజలకు ప్రతి ఒక్కరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను అని పేర్కొన్నారు.

# జిల్లా కలెక్టర్‌కు మద్దతు తెలిపిన ఉద్యోగులు









జిల్లా కలెక్టర్‌కు మద్దతు తెలుపుతున్న వివిధ శాఖల ఉద్యోగులు

**అనంతపురం కలెక్టరేట్, నవంబర్ 8 ప్రభాతవార్త**

వరుసగా రెండో రోజు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికిమద్దతు తెలుపుతూ ప్ర భుత్వ ఉద్యోగులు కార్యక్రమాలు చేపట్టారు. సోమవారం స్పందన కార్యక్ర మంలో తాడిపత్రి మున్సిపల్ చైర్‌పర్సన్ జెసి ప్రభాకర్‌రెడ్డి ప్రవర్తనకు నిరస నగా ప్లకార్డులు ప్రదర్శించారు. నల్లబ్యాడ్జీలు ధరించి కార్యాలయ విధులలో పాల్గొన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ ఉద్యానశాఖ, గిరిజన సంక్షేమ శాఖ, డీఆర్‌డిఏ, ఎన్రెడ్‌క్యాప్, చేనేత, జౌళి శాఖ, అగ్నిమాపక శాఖల ఉన్నతా ధికా రులు, సిబ్బంది తమ కార్యాలయాల వద్ద జిల్లా కలెక్టర్‌కు మద్దతు తెలుపుతూ నినాదాలు చేశారు. స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రవర్తించిన తీరు జిల్లా ఉద్యోగులందరికీ ఆదర్శంగా నిలిచిందన్నారు. అవతలి వ్యక్తి ఎంత దురుసుగా ప్రవర్తిస్తున్నా సంయమనం కోల్పోకుండా జిల్లా కలెక్టర్ ఉండటం ప్రతి ఒక్క ఉద్యోగి నేర్చుకోవాలన్నారు.




02ATP27_02ATP27.qxd 08-11-2022 PM 09:55 Page 1



## మూతపడ్డ దేవాలయాలు



**డి.హిరేహాళ్ నవంబరు 8 ప్రభాతవార్త :** మండలంలో మంగళవారం దేవాలయాలు మూతపడ్డాయి. సంపూర్ణ చంద్ర గ్రహణంను పురస్కరించుకుని ఆయా ఆలయాల ధర్మకర్తలు, అర్చకులు దేవాలయాలను మూసివేశారు. ఆలయాల్లో దేవుళ్ళకు ఎలాంటి పూజలు నిర్వహించ కుండ ఉదయం నుంచి ఆలయాల తలుపులు మూసివేశారు. మండలంలోని మురడి ఆంజనేయస్వామి దేవాలయం, ఓబుళాపురం మహాలక్ష్మమ్మ దేవాలయం, డి.హిరేహాళ్‌లో శ్రీనీలకంఠేశ్వర దేవాలయం, హెచ్.సిద్దాపురంలో గవిశిద్దేశ్వర దేవాలయం, కాదలూరులో కాశీవిశ్వనాథసా ్వమి ఆలయం, పులకుర్తి ఈశ్వరస్వామి దేవాలయం, బాదనహాళ్‌లో గ్రామదేవత మారెమ్మ దేవాలయం, గొడిసెలపల్లిలో దేవమ్మ, రామాలయం, ఆంజనేయస్వామి తదితర దేవాలయాలు తలుపులు పూజలు జరుపకుండ మూసివేశారు. తిరిగి సాయంకాలం 7.30 గంటల తరువాత దేవాలయాల తలుపులు తెరిచి పూజలు నిర్వహించనున్నట్లు ఆయా ఆలయాల అర్చకులు తెలిపారు.

## వాహనాలు వేలం

**డి.హిరేహాళ్ నవంబరు 8 ప్రభాతవార్త :** డి.హిరేహాళ్ పోలీస్టేషన్‌లో ఈ నెల 10న కారు, ద్విచక్ర వాహనాలు వేలం వేయనున్నట్లు ఎస్.ఐ.రామకృష్ణారెడ్డి తెలిపారు. గతంలో మండల పరిదిలోని పలు ప్రాంతాల్లో కర్ణాటక మద్యం అక్రమంగా తరలిస్తూ పట్టుబడ్డ కేసుల్లో ఒక ఇండిక కారు, 16 ద్విచక్ర వాహనాలు మొత్తం 17 వాహనాలు వేలం వేస్తామని ఎస్.ఐ.చెప్పారు. ఈ వేలం డి.హిరేహాళ్ పోలీస్టేషన్ ఆవరణలో మద్యాహనం 1గంటలకు వేలం ఉంటుందని ఆశక్తి ఉన్న వ్యక్తులు వేలం పాటలో పాల్గొనడానికి ముందుగా ద్విచక్ర వాహనాలకు రూ.3000లు, కారు వేలం పాటలో పాల్గొనాలంటే రూ.4000లు డిపాజిట్ చెల్లించి టోకన్ నెంబరు పొంది వేలంలో పాల్గొనాల్సి ఉంటుందని ఎస్.ఐ.తెలిపారు.

## ఏపిజిబి సేవలు సద్వినియోగం చేసుకోండి



ర్యాలీ నిర్వహిస్తున్న ఏపిజిబి బ్యాంకు ఉద్యోగులు

**కళ్యాణదుర్గం టౌన్, నవంబర్ 8 ప్రభాత వార్త :** కళ్యాణదుర్గం ప్రాంతంలో ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ద్వారా అందించే సేవలను ప్రజలు, ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని అనంతపురం రీజనల్ మేనేజర్ టి.మోహన్‌రెడ్డి, స్థానిక బ్రాంచ్ మేనేజర్లు పరమశివ, మురళీలు పిలుపునిచ్చారు. స్థానిక వాల్మీకి నగర్‌లో బుట్నా కాంప్లెక్స్‌లో నిర్వహిస్తున్న ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఉద్యోగులు,నియోజకవర్గ పరిదిజలోని ఏపిజిబి బ్రాంచ్ మేనేజర్లు, ఖాతాదారులు మంగళవారం రోడ్ షో నిర్వహించారు. డిపాజిట్లు, వర్తక వాణిజ్య రుణాలు, లాకర్ సౌకర్యాలు, ఇతరాత్ర సేవలపై ఖాతాదారులకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. తమ బ్యాంకు ద్వారా ఎలాంటి సేవలు పొందాలన్నా 9490158227, 9441646163 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని మేనేజర్ కోరారు.

## ఉపాధి పనులకు వెంటనే బిల్లులు చెల్లించాలి



ఏపిఓకు వినతిపత్రం అంజదేస్తున్న దృశ్యం

**బెలుగుప్ప, నవంబర్ 8 ప్రభాతవార్త :** మండల కేంద్రం లోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సిపిఐ జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, మండల వ్యవసాయ కార్యదర్శి అశోక్ ఆధ్వర్యంలో ఏపిఓకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి మాట్లాడుతూ.. పనిచేసిన కార్మికులకు పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, వలసల నివారణ కూడా తగ్గించాలని ఉపాధి కూలీలు 100 రోజుల నుంచి 150 రోజులకు పెంచాలని, ప్రతి కుటుంబానికి పనిచేసే కూలీలకు రూ.600లకు పెంచాలని కేంద్ర బిజెపి ప్రభుత్వం రెండు లక్షల కోట్లు ఉపాధిహామీ పనులకు నిధులను కేటాయించాలని, కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జీవోను రద్దు చేసి పాత జీవోనే అమలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమన్న, ఎరిస్వామి, నగేష్, మారెన్న, సిపిఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నల్లబ్యాడ్జీలతో నిరసన



నిరసన తెలియజేస్తున్న ఉద్యోగులు

**బొలంగొవ్ప, నవంబర్ 8 ప్రభాత వార్త :** స్థానిక తహశీల్దారు కార్యాలయంలో తహశీల్దారు ఈశ్వరయ్య శెట్టి, ఉద్యోగస్తులు నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య శెట్టి మాట్లాడుతూ.. సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌నాగలక్ష్మి తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి దురుసుగా ప్రవర్థించడం పట్ల నిరసన వ్యక్తం చేశామని తెలిపారు. ఇలా ప్రవర్తించిన జెసిప్రభాకర్‌రెడ్డి వెంటనే కలెక్టర్‌కు క్షమాపణ చెప్పాలని, లేనిచో ప్రతిరోజుకార్యాలయాల్లో నిరసనలు వ్యక్తం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు పీరాసాబ్, ఆర్ఐ నగేష్‌బాబు, తహశీల్దారు కార్యాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## తల్లిదండ్రులు మృతి చెంది అనాథలుగా మారిన చిన్నారులకు చేయూత

- వార్త కథనానికి స్పందించిన విశ్రాంత ఉద్యోగులు



ఆర్తిక సహాయం అందజేస్తున్న దృశ్యం

**శెట్టూరు, నవంబర్ 8 ప్రభాతవార్త :** మండల పరిధిలోని బసంపల్లి గ్రామంలో గత వారం రోజుల క్రితం అక్టోబర్ 26వ తేది మఘునాథ్ చౌదరి అనారోగ్యంతో మృతి చెందిన విషయం కుటుంబాన్ని ఎంతో కలవరపెట్టిన విషయం తెలిసిందే. అయితే మృతుడికి లక్ష్మి, అశ్విని అని ఇద్దరు ఆడ పిల్లలు కలరు. మృతుడి భార్య పద్మావతి గతంలో కరోనా భారిన పడి మృతి చెందారు. తల్లిండ్రులను కోల్పోయిన పిల్లలు అనాథలుగా మిగలడంతో వారి పెదనాన్న అయిన శ్యామసుందర్ చౌదరి ఆ పిల్లలకు దిక్కు అయ్యారు. ఈ విషయం వారం రోజుల నుంచి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం కావడంతో సత్యసాయి జిల్లా విశ్రాంత ఉద్యోగులు స్పందించి 5,500 రూపాయలు ఆర్థిక సాయం అందజేసి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. ఆ కుటుంబానికి మేము ఏ సహాయం చేయడానికైనా ముందుంటామని వారికి ధైర్యం చెప్పి పిల్లలకు భాగా చదివించాలని అందుకు కావాల్సిన సహాయాన్ని మేము అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపి ఎన్‌జిఓ ప్రెసిడెంట్ లింగా రామ్మోహన్, ఏపిసిడబ్ల్యు రిటైర్డ్ విశ్రాంతి ఉద్యోగి టి.రామన్న, ఏజిఎం ఏడిసిసి బ్యాంకు టి.శ్రీనివాసులు, రెసిడెన్షియల్ ప్రిన్సిపాల్ రొద్దం పి.గోపాల్, జె.శ్రీరఘుగంగా, బోర్‌వెల్స్ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రగ్రహణం సందర్భంగా హిందూ ఆలయాలు మూత



**బొమ్మనహాళ్, నవంబర్ 8 ప్రభాతవార్త :** మండల పరిధిలోని హిందూ ప్రధాన ఆలయాలు చంద్రగ్రహనం సందర్భంగా ప్రధాన ఆలయ ద్వారాలను స్వామివారి పూజల అనంతరం మూత వేసినట్లు, నేమకల్లు ఆంజినేయ స్వామి దేవాలయం ప్రధాన అర్చకులు అనీల్ స్వామి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రధాన ఆలయాలలో ఉదయం స్వామివారికి అర్చనల అనంతరం ఆలయాలను మూతవేశామని, అన్ని సేవలను నిలుపుదల చేశామన్నారు. బుధవారం ఉదయం 5:30 గంటలకు ఆలయం పరిశుభ్రత చేసి నిరంతరం సేవలు ప్రారంభిస్తామని వారు తెలిపారు.

## జిల్లా కలెక్టర్‌కు జెసి ప్రభాకర్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి



రెవెన్యూ కార్యాలయం ప్రధాన గేటు వద్ద నిరసన తెలియజేస్తున్న సిబ్బంది

**బొమ్మనహాళ్, నవంబర్ 8 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయం వద్ద మంగళవారం మధ్యాహ్నం విరామ సమయంలో రెవెన్యూ సిబ్బంది తహశీల్దారు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రధాన గేటు వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విఆర్ఓల ఉపాధ్యక్షులు గోపాల్ మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు ప్రభుత్వ అధికారులను చులకనగా మాట్లాడటం, సభాసమావేశంలో అగౌరవ పరచడం సమంజసం కాదని, ప్రభుత్వ అధికారులు ప్రజల శ్రేయస్సు ను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ ఆదేశాలను రాజ్యాంగ బద్దంగా అమలు చేసే వారిమేకానీ ప్రభుత్వ అధికారులు జిల్లాకలెక్టర్ నాగలక్ష్మిని చులకనగా మాట్లాడిన తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్ర విఆర్ఓల సంఘం ఆదేశాల మేరకు నిరసన వ్యక్తం చేస్తున్నామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు డిటి భోగన్న గౌడ్, ఆర్ఐ బాలకృష్ణ, జిల్లా విఆర్ఓల నాయకుడు యుగంధర్, విఆర్ఓలు బాలాజీ నాయక్, పర్వీన్‌భాను, వన్నూరుస్వామి, విఆర్ఏల నాయకులు మారుతి, రవి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## నీటి సమస్యను పరిష్కరించిన వైస్ ఎంపిపి



పైపులైన్ ఏర్పాటు చేస్తున్న దృశ్యం

**లేపాక్షి, నవంబర్ 8 ప్రభాతవార్త :** మండలంలోని కల్లూరు గ్రామంలో నీటి సమస్య పరిష్కారం కోసం స్థానిక వైస్ ఎంపిపి నీలావతి కృషి చేశారు. కల్లూరు గ్రామంలో నీటి సరఫరా విభాగం కింద నాలుగు బోర్లు పనిచేస్తున్నాయి. అయితే నాలుగు బోర్లు చెరువులో వున్నాయి. అందులో గత మూడు నెలలుగా కురిసిన వర్షాలకు చెరువు నిండి మరువలు పారుతుండడంతో మూడు బోర్లు చెరువులోనే వుండడండతో నీటి సమస్య తీవ్రంగా వుంది. ఒక్క బోరు మాత్రమే పనిచేస్తోంది. దీంతో నీటి కోసం ఆ గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దీనిని దృష్టిలో వుంచుకుని వైస్ ఎంపిపి నీలావతి స్పందించి నీటి సమస్య పరిష్కారం కోసం ఆరా తీశారు. అయితే గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులతో చర్చించి నీటి సమస్యను పరిష్కరించాలని తెలియచేశారు. దీనిని దృష్టిలో వుంచుకుని మండల పరిషత్ నిధులతో చెరువులో వున్న బోరు నుండి ఎస్‌సి, బిసి కాలనీలకు నీటి పైపులైన్ ద్వారా నీటిని సరఫరా చేశారు. దీంతో గ్రామస్తులు వైస్ ఎంపిపికి కృతజ్ఞతలు తెలిపారు.

## కళ్యాణదుర్గం డిఎస్పీగా బి.శ్రీనివాసులు



కళ్యాణదుర్గం డిఎస్పీ బి.శ్రీనివాసులు

**కళ్యాణదుర్గం, నవంబర్ 8 ప్రభాతవార్త :** కళ్యాణదుర్గం డిఎస్పీగా బి.శ్రీనివాసులును ప్రభుత్వం నియమించింది. డిఎస్పీగా నూజివీడులో విధులు నిర్వహిస్తున్న ఆయన కళ్యాణదుర్గం డిఎస్పీగా బదిలీల్లో భాగంగా పోలీసు ఉన్నతాధికారులు పోస్టింగ్ ఇచ్చారు. ఈయన గతంలో కళ్యాణదుర్గం సిఐగా కూడా పని చేసినట్లు సమాచారం. నిజాయితీ గల ఆఫీసర్‌గా కళ్యాణదుర్గంలో తన ముద్ర వేసుకున్నారు.

## గుమ్మఘట్ట పోలీస్‌స్టేషన్‌లో వాహనాలు బహిరంగ వేలం

**గుమ్మఘట్ట, నవంబర్ 8 ప్రభాతవార్త :** గతంలో వివిధ కర్ణాటక మద్యం కేసులో పట్టుబడిన 4ద్విచక్ర వాహనాలు ఈ నెల 10వ తేదిన గుమ్మఘట్ట పోలీస్ స్టేషన్ ఆవరణంలో ఉదయం 11 గంటలకు వాహనాల వేలం జరుపబడునని గుమ్మఘట్ట ఎస్ఐ సునత ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఆసక్తి గల వారు ద్విచక్ర వాహనాలకు వేలం పాట పాడదలచిన వారు 3వేలు అడ్వాన్సు ను డిపాజిట్‌గా చెల్లించి టోకన్ నెంబర్ పొంది వేలం పాటలో పాల్గొనవచ్చని తెలిపారు.

## కరుణ వృద్ధాశ్రమంలో బియ్యం, నూతన వస్త్రాలు వితరణ



వృద్ధాశ్రమంలో వస్త్రాలు పంపిణీ చేస్తున్న సామకోటి ఆదినారాయణ

**కొత్తచెరువు, నవంబర్ 08, ప్రభాతవార్త :** మండల పరిధిలోని మైలేపల్లిలో కరుణ వృద్ధాశ్రమం నందు శ్రీసత్యసాయి జిల్లా తెదేపా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ మంగళవారం మూడు బస్తాల బియ్యం, వృద్ధులకు నూతన వస్త్రాలను వితరణ ఇచ్చారు. అలాగే చిన్న పిల్లలకు బిస్కెట్లు అందించారు. ఈ సందర్భంగా సామకోటి ఆదినారాయణ మాట్లాడుతూ, కలియుగ దైవం భగవాన్ సత్యసాయి బాబా ఆశీస్సులతో వృద్ధాశ్రమంలో ఉన్న దాదాపు 15 మందికి పైగా వృద్ధులకు అలాగే చిన్న పిల్లలకు నూతన వస్త్రాలతో పాటు నిత్యవసర వస్తువులు అందించినట్లు తెలియజేశారు. ముఖ్యంగా వారు పడుతున్నటువంటి కష్టాలను దృష్టిలో ఉంచుకొని తన వంతుగా సహాయం చేసినందుకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. అలాగే వారు త్రాగునీటి సమస్యను మొరపెట్టుకోవడంతో రాబోయే రోజుల్లో సమస్య లేకుండా పరిష్కరిస్తానని, అలాగే డ్రైనేజీ సమస్యను కూడా పరిష్కరిస్తానని తెలియజేయడం జరిగిందన్నారు. అలాగే లోకేష్‌బాబు పాదయాత్ర విజయవంతం కావాలని, అలాగే నారా చంద్రబాబు నాయుడు, పల్లె రఘునాథ్ రెడ్డిలపై భగవాన్ సత్యసాయి బాబా, వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు ఎళ్ళవేళలా ఉండాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తచెరువు తెదేపా కన్వీనర్ రామకృష్ణ, తెదేపా వడ్డెర సంఘం నియోజకవర్గ అధ్యక్షులు శ్రీనివాసులు, నియోజకవర్గ బిసి నాయకుడు కొడపగానిపల్లి శివ, మైలేపల్లి శివ, గంగాధరం, పాపారెడ్డి, శ్రీరాములు, చెన్నకృష్ణ, రమేష్, మహిళా నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయానికి విరాళం

**హిందూపురం టౌన్, నవంబర్ 8 ప్రభాతవార్త** పట్టణంలోని లక్ష్మీపురంలో వెలసిన శ్రీబాలాజీ ఆలయానికి లక్ష్మీపురంకు చెందిన భక్తులు నాగరత్నమ్మ, శ్రీహరి కుటుంబసభ్యులు మంగళవారం 15 వేల రూపాయలను ఆలయానికి విరాళంగా అందచేశారు. ఆలయానికి అవసరమైన అఖండజ్యోతులు, ఇతర సామాగ్రి కొనుగోలు నిమిత్తం ఈ విరాళం అందించినట్లు దాతలు తెలిపారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్య క్రమంలో ఆలయ అర్చకులు సత్యనారాయణ, కమిటీ సభ్యులు విజయ్‌గోపాల్, వెంకరాముడు, తదితరులు పాల్గొన్నారు.

## కర్నాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న సెబ్ పోలీసులు

**హిందూపురం, నవంబర్ 8 ప్రభాతవార్త :** హిందూపురం సెబ్ పోలీసుస్టేషన్ పరిధిలోని పరిగి మండలం చెర్లోపల్లి సేవామందిర్ మార్గంలో మంగళవారం సెబ్ అధికారులు దాడులు నిర్వహించి అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకుని 16 బాక్స్‌ల మద్యంతో పాటు కారు స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సిఐ లక్ష్మీదుర్గయ్య తెలిపారు. అదేవిధంగా పోలీసు స్టేషన్ పరిధిలో చేపట్టిన దాడుల్లో 8 మందిని అదుపులోకి తీసుకుని 3 మోటర్‌సైకిళ్ళు, మద్యాన్ని స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఈ దాడుల్లో సెబ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో యువకుడు మృతి



మృతి చెందిన రాకేష్

**పరిగి, నవంబర్ 8 ప్రభాతవార్త :** హిందూపురం పట్టణంలోని వక్కలబజార్‌లో ఓ ఎలక్ట్రికల్ దుకాణంలో మంగళవారం విద్యుదాఘాతానికి గురై రాకేష్ (32) అనే యువకుడు మృతి చెందాడు. పరిగి మండలం చిన్నపల్లి గ్రామానికి చెందిన రాకేష్ ఎలక్ట్రికల్ దుకాణంలో పనిచేసేవాడు. దుకాణంలో వస్తువులు తీసుకొచ్చేందుకు లిఫ్టులో వెళుతుండగా విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. జరిగిన ఘటనపై ఒకటవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## కోతి గుట్ట.. ప్రజా గోడు పాలకులకు పట్టదా

- ఇళ్ల మధ్యలో కంప చెట్లు
- మురికి నీటితో తిష్ట వేసిన పారిశుద్ధ్యం
- 5 నెలల నెలల నుంచి నడి వీధిలో వెలగని లైట్లు

అంధకారంలో 14 వార్డు ప్రజలు



ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధిత వాసులు

**రాయదుర్గంటౌన్, నవంబర్ 8 ప్రభాత వార్త :** పట్టణంలోని కోతిగుట్ట 14వ వార్డు నందు డ్రైనేజి లేకపోవడం ప్రజలు తీవ్రమైన ఇబ్బందులకు గురి అవుతున్నామంటూ.. బాత్రూంలో నుంచి వచ్చిన నీరు ఇళ్ల ముందు నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతుందంటూ.. దీనికి తోడు అకాల వర్షపు నీరు రావడంతో గుంతలు గుంతలుగా ఏర్పడి నిచిలిన మురికి నీరు, నీటిపై దోమలు వ్యాప్తి చెంది దోమ కాటు వల్ల ప్రజలు నానా రోగాల భారిన పడుతున్నారన్నామన్నారు. ఇళ్ల ముద్దు పెద్ద పెద్ద కంప చెట్లు పెరిగి పందులకు అవాసంగా మారాయంటూ, చెత్తా చెదారంతో నిండుకు పోయి పరిసర ప్రాంతాల్లో పిల్లల మల మూత్ర విసర్జనతో విసుగెత్తిపోయిన వార్డు ప్రజలు , కనీసం వీధిలైట్లు కూడా లేని పరిస్థితి దాపురించిందని, వీధి లైట్ల కోసం ఎన్నో మార్లు కౌన్సిలర్‌కు తెలుపగా ఆయన మాత్రం వేసి ఉన్న లైట్లు ఎవరు దొంగలించారు కదా !! వాళ్లను పట్టుకురండి అప్పుడే నేనను వీధికి లైట్ వేయిస్తానని కౌన్సిలర్ వార్డు ప్రజలతో వాగ్వివాదానికి దిగుతూ వెటకారంగా మాట్లాడుతున్నాడని స్థానికులు వాపోయారు. రాత్రి పూట పిల్లలు,పెద్దలు, కాలుబయటపెట్టాలంటేనే భయం వేస్తుందంటూ, పాములు తేళ్ళ, పాకుతుంటాయని, ప్రక్కనేఉన్న కౌన్సిలర్‌కు ఎన్నోసార్లు బ్రతిమిలాడినా ఎటువంటి స్పందన కానీ ప్రయోజనం కాని లేదంటూ కౌన్సిలర్‌పై స్థానికులు మండిపడుతున్నారు. మావార్డుకు ఎన్నో మంచి పనులు చేస్తాడని వార్డు అభివృద్ధికి సహకరిస్తారని ఎంతో ఆశతో నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించినందుకు మా నమ్మకాన్ని వమ్ము చేస్తున్నాడని, మూడున్నర ఏళ్ల గడిచిపోతున్నా.. ఏనాడు తిరిగి చూసిందే లేదని 5 నెలలు గడిచిపోతున్నా కనీసం వీధిలైట్లకు దిక్కులేరి, పోయిపోయి ఇలాంటివ్యక్తిని గెలిపించుకున్నామా అంటూ నిలువునా మోసపోయామ్మంటూ స్థానికులు శ్రీనివాసులు నాగలక్ష్మీ వనజ, రూప, గంగోత్రి, ప్రమీల, పార్వతి, మంగమ్మ, నాగమ్మ, రత్నమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. మునిసిపల్ అధికారులు స్పందించి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## లోకేష్ బాబును కలసిన పుట్టపర్తి తెదేపా నాయకులు



నారా లోకేష్ బాబుతో పుట్టపర్తి తెదేపా నాయకులు దృశ్యం

**పుట్టపర్తిరూరల్, నవంబర్ 08, ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి నారా లోకేష్ బాబును పుట్టపర్తికి చెందిన పలువురు తెదేపా నాయకులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో రాష్ట్ర తెదేపా సాంస్కృతిక విభాగం ఉపాధ్యక్షుడు కరణం సుబ్రహ్మణేశ్వర రావు, హిందూపురం పార్లమెంట్ టిఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి షామీర్, టిఎన్‌టియుసి ఉపాధ్యక్షులు కురుమాల శేషు, కేశవ, శ్రీరాములు తదితరులు నారా లోకేష్ బాబును కలుసుకున్నట్లు తెలియజేశారు. ఈ సందర్బంగా నారా లోకేష్ వారిని అభినందించిన పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించినట్లు తెలియజేశారు.

## చలో పార్లమెంట్‌ను విజయవంతం చేయండి

**పుట్టపర్తిటౌన్, నవంబర్ 08, ప్రభాతవార్త :** నూతన జాతీయ విద్యావిధానం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25న చలో పార్లమెంట్ కార్యక్రమం విజయవంతం చేయాలని ఎఐఎస్ఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం విద్యార్థి సంఘం కార్యాలయంలో మాజీ జాతీయ కార్యదర్శి మీసాల వేమయ్య ఆధ్వర్యంలో జరిగిన ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, జాతీయ నూతన విద్యావిధానం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పార్లమెంట్ వద్ద నిరసన తెలియజేస్తున్నామన్నారు. విభజన చట్టం ప్రకారం 11 జాతీయ సంస్థలు రాష్ట్రంలో ప్రారంభించినప్పటికీ నిధులు కేటాయించక పోవడంతో మొండిగోడలకే పరిమితమయ్యాయన్నారు. విద్యార్థులు సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, చంద్రశేఖర్, రాజన్న, ప్రసాద్, కుళ్ళాయప్ప, పవన్, అరుణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ నెట్టికంటుని ఆలయం ఉదయం మూసివేత...

రాత్రి ఆలయ శుద్ధి సంప్రోక్షణతో ప్రత్యేక పూజలతో శ్రీవారి దర్శనాలు....



చంద్రగ్రహణం కారణంగా శ్రీ నెట్టికంటుని ఆలయం మూసివేత దృశ్యం.

**గుంతకల్లు, నవంబర్ 08 ప్రభాతవార్త :** రాష్ట్ర దేవాదాయ ధర్మాధాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయ స్వామి వారి దేవ స్థానం అధికారులు మంగళవారం ఉదయం పాక్షిక చంద్రగ్రహణంను పురస్కరించుకుని ఆలయంను మూసివేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు గరుడాచార్యులుతో పాటు వేదపండితులు తెలిపిన వివరాల మేరకు.. కార్తీక శుద్ధ పౌర్ణమి రాహుగ్రస్త అస్తమయ పాక్షిక చంద్రగ్రహణం మధ్యాహ్నం 02-19 గంటల నుండి సాయంత్రం 06-19గంటల వరకు సంభవిస్తున్నందున ఉదయం 08-10గంటల నుండి రాత్రి 7గంటల వరకు ఆలయం మూసివేయాలని నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. ఈక్రమంలోనే శ్రీవారి పూజలు నిలుపుదల కారణంగా భక్తాదులకు శ్రీవారి దర్శనం రద్దు చేయడం జరిగిందన్నారు. తదుపరి శ్రీవారి పూజాధికార్యక్రమాలు యధాప్రకారం రాత్రి ఆలయ శుద్ధితో పాటు సంప్రోక్షణతో శ్రీవారికి ప్రత్యేక అభిషేకాలుతో విశేష అర్చన పూజా కార్యక్రమాల నిర్వహణ అనంతరం భక్తాదులకు శ్రీవారి దర్శనం ఏర్పాట్లు యధావిధిగా జరుగునన్నారు.

## ఈ నెల 14 నుండి 55వ గ్రంథాలయ వారోత్సవాలు



గోడపత్రికలను విడుదల చేస్తున్న తహశీల్దార్, ఎంపిడిఓ దృశ్యం

**కొత్తచెరువు, నవంబర్ 08, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన కొత్తచెరువు శాఖ గ్రంథాలయం నందు శ్రీసత్యసాయి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేది నుండి 20వ తేది వరకు 55వ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి జయరాం తెలియజేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఎంపిడిఓ, తహశీల్దార్ కార్యాలయాలకు వెళ్ళి సంబంధిత గ్రంథలయ వారోత్సవాలకు సంబంధించిన గోడపత్రికలను ఎంపిడిఓ సిద్ధార్థ రెడ్డి, తహశీల్దార్ రామాంజినేయులు రెడ్డిల చేతులమీదుగా ఆవిష్కరించారు. అనంతరం గ్రంథాలయ అధికారి జయరాం మాట్లాడుతూ, ఈ నెల 14న ప్రారంభవేడుకలు బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, మాదకద్రవ్యాలపై అవగాహన, పుస్తక పఠనం ప్రాముఖ్యత, 16న గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న నాయకులను స్మరించుకోవడం, 17న కవి సమ్మేళనం, సెమినార్‌లో రచయితల సందేశం, 18న విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ పోటీల నిర్వహణ, 19న దిశ చట్టం మహిళా సాధికారతపై అవగాహన, 20న డిజిటల్ లైబ్రరీపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

## స్మశాన వాటికకు స్థల పరిశీలన



స్మశాన వాటిక కొరకు స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు దృశ్యం

**కొత్తచెరువు, నవంబర్ 08, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన కొత్తచెరువులోని కమ్మపాళ్యం, వడ్డెరకాలనీ, బిసి కాలనీ వాసులకు స్మశాన వాటిక లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న క్రమంలో వారు సోమవారం జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్‌కు అరుణ్ ప్రశాంత్ అధ్వర్యంలో వినతి సమర్పించారు. దీంతో కలెక్టర్ స్థానిక తహశీల్దార్ రామాంజినేయులు రెడ్డికి సమస్య పరిష్కరించాల్సిందిగా ఆదేశించడంతో స్పందించిన తహశీల్దార్ మంగళవారం మండల సర్వేయర్ సురేష్, రెవెన్యూ సిబ్బందితో కలసి పుట్టపర్తి రహదారిలోని నాగులకనుమ వద్ద ఉన్న చెత్తపై సంపద తయారీ కేంద్రం సమీపంలోని స్థలాన్ని పరిశీలించడం జరిగింది. గతంలో ఆయా కాలనీల వాసులు తమ కుటుంబంలో మృతి చెందిన వారిని స్థానిక బుక్కపట్నం చెరువు భూమిలో అంత్యక్రియలు నిర్వహించేవారు. అయితే గత మూడు సంవత్సరాల నుండి చెరువు పూర్తి స్థాయి నీటితో నిండి ఉండడంతో ఇక్కడ అంత్యక్రియలు నిర్వహించుకునేందుకు వీలు లేకుండా పోయింది. దీంతో కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదుల దినోత్సవం సందర్భంగా ఫిర్యాదు అందించిన నేపథ్యంలో వెంటనే స్పందించిన అధికారులు స్మశాన వాటిక కొరకు స్థల పరిశీలన చేయడం జరిగింది.

## 75 శాతం హాజరు ఉంటేనే విద్యాదీవెన

**బుక్కపట్నంరూరల్, నవంబర్ 08, ప్రభాతవార్త**




సమావేశంలో మాట్లాడుతున్న ఎఎస్‌డబ్ల్యూఓ జి.శ్రీరాములు

కళాశాల విద్యార్థులు 75% హాజరు ఉంటేనే జగనన్న విద్యాదీవెన, వసతి దీవెనలు వర్తిస్తాయని ఎఎస్ డబ్ల్యూఓ జి.శ్రీరాములు తెలియజేశారు. మంగళవారం శ్రీసత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాల యందు స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రాం, దీక్షారంభంలో భాగంగా మొదటి సంవత్సరం విద్యార్థులతో ప్రిన్సిపాల్ లక్ష్మయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన జగనన్న విద్యాదీవెన నియమనిబంధనలను వివరించి, సొమ్ము విద్యార్థుల తల్లుల ఖాతాలలో జమచేయడం జరుగుతుందని, కళాశాల ఫీజు ఎంతో తెలుసుకొని ఆ మొత్తం కట్టి రసీదు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రవికుమార్, అధ్యాపకులు డా.సి.ఆదినారాయణ, దస్తగిరి, చంద్రమోహన్, వెంకటకృష్ణయ్య, ఆనంద్, నాగేంద్ర, రాజశేఖర్, వెంకటేశులు మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## నాయీ బ్రాహ్మణుల సంఘం నూతన జిల్లా కమిటీ ఎంపిక

**పుట్టపర్తిటౌన్, నవంబర్ 8, ప్రభాతవార్త :** శ్రీసత్యసాయి జిల్లా నాయీ బ్రాహ్మణ సంఘం నూతన కమిటీని ఆ సంఘం నాయకులు మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక సాయి అరామంలో జిల్లాలోని 32 మండలాల ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షునిగా లక్ష్మీనారాయణ, ఉమ్మడి జిల్లాల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎల్లనూరు ప్రసాద్‌ల ఆధ్వర్యంలో నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షునిగా మాల్యవంతం మారుతి ప్రసాద్, కార్యదర్శిగా తలమర్ల రవి, కోశాధికారిగా కుమ్మెత రమేష్, గౌరవాధ్యక్షులుగా శ్రీనివాసులు, గోరంట్ల నాగభూషణ, తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్బంగా నాయకులు మాట్లాడుతూ, సమాజంలో నాయీ బ్రాహ్మణులను చిన్నచూపు చూస్తున్నారని, ఆత్మగౌరవంతో సాంఘికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగడానికి నాయీ బ్రాహ్మణులందరూ ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. నూతన కమిటీ నాయీ బ్రాహ్మణులు మాట్లాడుతూ, సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామన్నారు.

## సచివాలయ ఉద్యోగులు చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించండి - కలెక్టర్ బసంత్‌కుమార్


రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ బసంత్‌కుమార్


హిమోగ్లోబిన్ పరీక్షలు చేయించుకుంటున్న కలెక్టర్ బసంత్‌కుమార్

బత్తలపల్లి, నవంబర్ 8 ప్రభాతవార్త

గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ సేవలు దగ్గర చేసేందుకు తీసుకు వచ్చిన సచివాలయ ఉద్యోగులు చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ బసంత్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం అకశ్మికంగా బత్తలపల్లి 1, సంజీవపురం, పోట్లమర్రి గ్రామాలలోని సచివాలయాలను కలెక్టర్ తని ఖీలు చేశారు. ఈ సందర్బ ంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది తప్పని సరిగా యూనిఫాం ధరించి రావాలన్నారు. లేకుంటే అధికారులు వారి పై చర్యలు తీసకోవాలన్నారు. అంతేకాక సచివాలయాలకు వచ్చే ఫిర్యాదులు పెండింగ్‌లో లేకుండా తక్షణం పరిష్కరించాలన్నారు. కంప్యూటర్లో పొందు పరచాల్సిన అంశాలన్నీ వెంటనే అప్లోడ్ చేయాలన్నారు. వాటిలో నిర్లక్ష్యంగా వుంటే ప్రజ లకు ఇబ్బంది కలుగుతుంది కనుక కఠిన చర్యలు వుంటాయన్నారు. ప్రజలతో మమేకమై సమస్యలను విని పరిష్కరి ంచినపుడే సచివాలయ వ్యవస్థకు మంచి గుర్తింపు వస్తుందన్నారు. ఈశ్రమ్ పోర్టల్‌లో ఈశ్రమ్ రిజిస్ట్రేషన్‌లు తక్కువగా వున్నాయని వాటిలో పురోగతి తీసుకురావాలన్నారు. జగనన్న లే అవుట్‌లలో నిర్మాణాలు, గ్రామాలలో నిర్మించే సచివాలయాలు, ఇతర భవనాల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలన్నారు. అర్హులైన వారందరికి సంక్షేమ పథకాలు అందజేసేలా చూడాలన్నారు. సంజీవపురం సచివాలయంలో ఏఎన్ఎంతో కలెక్టర్ హిమో గ్లోబిన్ పరీక్షలు చేయించు కున్నారు. అంతకు ముందు సచివాలయాలలో రికార్డులు, గోడ పత్రికలు పరి శీలించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ యు ోగశ్వరిదేవి, ఎంపిడిఓ సాయి మనోహర్, నారాయణ స్వామి, రామాంజనే యులు, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది - ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

యల్లనూరు, నవంబర్ 8 ప్రభాతవార్త

రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని మన ముఖ్యమంత్రి జగనన్న లక్ష్యమని శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని గడ్డంవారిపల్లి గ్రామంలో చెరువు వద్ద గండికోట ఎత్తిపోతల పథకం కింద నీరు వదిలే కార్య క్రమాన్ని నిర్వహించారు. ఈ కార్య క్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి హాజర య్యారు. ముందుగా ఎమ్మెల్యేకు వైకాపా నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే టెంకాయలు కొట్టి పూజలు నిర్వహించి నీటిని విడుదల చేసి జలహారతి ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజక ర్గంలోని అన్ని చెరువులు నిండుకుండలా కళకళలాడుతున్నాయన్నారు. రైతులు పంటలు పండించుకునేందుకు జీవనోపాధి లభించాలని, మంచినీటి వనరులకు సంబంధించి ప్రతిపాదనలు ఇక్కడ అధికారులతో చేయించి ఒక నివేదిక రూపంలో తయారు చేసి జగనన్నకు అందించామన్నారు. అక్కడ నుండి జగనన్న ఉన్నతాధికారు లకు సూచనలు చేయడంతో మనకు నీళ్ళు వస్తున్నాయని ని యోజకవర్గం ప్రజల కలలు నెరవేరుతున్నాయన్నారు. ఇక్కడ చెరువులో నీరు వుండడం వల్ల రైతులకు బోర్లలో నీరు పెరిగి మంచి పంటలు పండించు కోవచ్చని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి భోగా తి ప్రతాప్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, సర్పంచు రామాంజులరెడ్డి, వైకాపా నాయకులు రామ్మోహన్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, వెంకటరామిరెడ్డి, నాగలింగేశ్వర్‌రెడ్డి, బాలవెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## గుంటూరుకు చేరిన గుమ్మగట్ట తప్పుడు కేసు


మాజీ మంత్రి కాలవ

రాయదర్గం నవంబర్ 8(ప్రభాతవార్త)

రాయదుర్గం నియోజకవర్గంలోని గుమ్మఘట్ట పోలీసులు 2020 జనవరి 5న నమోదు చేసిన ఓ తప్పుడు కేసులో కుండ బద్దలు సుబ్బారావు

సోమవారం నోటీసులు ఇవ్వడాన్ని పౌరుల భావ ప్రకటన స్వేచ్ఛపై దాడిగానే చూడాలని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటనలో విడుదల చేశారు. మూడు రాజధానుల అంశంలో అప్పట్లో ఆయన చేసిన విశ్లేషణ సమాజంలో అలజడులు సృష్టించేదిగా ఉందన్నది ఫిర్యాదు సారాంశ మన్నారు. ఫిర్యాదుదారుడు అదే మండలం గొనబావికి చెందిన రామాంజి నేయులు అనే స్టోర్ డీలర్ అతను ప్రాథమిక విద్యను కూడా పూర్తి చేయలేదన్నారు. సంతకమే అతికష్టం మీద చేసే వ్యక్తిగా తెలుస్తోందన్నారు. శివరామకృష్ణన్, బోస్టన్ కమిటీల ప్రస్తావనతో ఎమ్మెల్యే కాపు రామచం ద్రారెడ్డి తయారు చేయించిన ఫిర్యా దుపై పాపం అతనితో సంతకం పెట్టించినట్లు ఉన్నారన్నారు. సదరు ఫిర్యాదును స్వీకరించిన స్టేషన్ హౌస్ అధికారి హెడ్ కానిస్టేబుల్ రఘునాథ్‌రెడ్డి ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడు పైగా బంధువునని చెప్పుకుంటుంటాడని తెలిపారు. దీన్ని బట్టి ఎమ్మెల్యే కాపు, స్క్రిప్టుపై ఓ అమాయకుడితో సంతకం పెట్టించి అతని బంధువు హెడ్ కానిస్టేబుల్ తో కేసు నమోదు చేయించి కుండ బద్దలు సుబ్బారావును ముద్దాయిగా మార్చారని స్పష్టంగా అర్థమవుతోందని అభిప్రాయపడ్డారు. పనిలో పనిగా సదరు ఫిర్యాదులో తనను తమ అధినేత చంద్రబాబును కుట్రదారులుగా చూపడం తాము ప్రభుత్వాన్ని అస్థిరపరిచాలని ప్రయత్నిస్తున్నట్లు పేర్కొనడాన్ని పరాకాష్టిగా అభివర్ణించారు. ఇలాంటి తప్పుడు ఫిర్యాదును స్వీకరించి కేసు నమో దు చేసి న పోలీసులు ఫిర్యాదు ఉద్దేశం పై కనీస విచారణ జరపకుండా ఇరు వై నెలల తరువాత ముద్దాయికి నోటీసు లివ్వడం, ఎద్దు ఈనిందంటే గాటికి కట్టేయ్ అన్న సామెతలు తలపిస్తోంది. విచారణ పేరుతో డయాలసిస్ చెక్కర వ్యాధి గ్రస్తుడైన 70 ఏళ్ల వృద్ధుడైన కుండ బద్దలు సుబ్బారావును ఇబ్బంది పెట్టాలనుకోవడం సబబు కాదన్నారు. పోలీసులు ఇప్పటికైనా ఫిర్యాదులోని అంశాలపై సంతకం కూడా సరిగా చేయలేని స్టోర్‌డీలర్ రా మాంజినేయులుకు ఉన్న అవగాహన ఏంటో మొదటి విచారణ చేయా లన్నారు. అతను ఎవరి స్క్రిప్టుపై సంతకం చేశాడో తెలుసుకోవాలని, దాని వెనుక ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి కుట్ర ఉంటే దానికి బయట పెట్టాలని డిమాండ్ చేసారు.

## అనంతపురం పోలీస్ హెడ్ క్వార్టర్స్ దర్గాలో ఘనంగా గ్యార్మీ వేడుకలు

### - ముస్లిం సోదరులప్రత్యేక ప్రార్థనల్లో ఎస్పీ - 3వేల మందికి అన్నదానం


గ్యార్మీ వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం


అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం క్రైం, నవంబర్ 8 ప్రభాతవార్త

ముస్లింసోదరుల పవిత్ర పర్వదినమైన గ్యార్మీ వేడుకలు మంగళవారం అనంతపురం పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో ఘనంగా నిర్వహించారు. అనంతపురం రేంజ్ డిఐజి ఎం. రవిప్రకాష్, జిల్లా ఎస్పీ డాక్టర్ పక్కీరప్ప కాగినెల్లి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ముందుగా పోలీసు ముస్లిం సోదరులతో కలిసి డిఐజి ఎస్పీలు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహజంచారు. అనంతరం గ్యార్మీ వేడుకల్లో భాగంగా డిఐజి ఎస్పీలు చేతుల మీదుగా పోలీసు ముస్లిం సోదరులకు సుమారు 3వేల మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రామ్మోహనరావు, ఇ.నాగేంద్రుడు, డిఎస్పీలు ప్రసా ద్‌రె డ్డి, ఆర్ల శ్రీనివాసులు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, సుధాకర్‌రెడ్డి, గాండ్ల హరినాథ్, తేజ్‌పాల్, దర్గా కమిటీ సభ్యులు, పలువురు సిఐలు, ఆర్ఎస్ఐలు, జిల్లా పోలీసు కార్యాలయం సిబ్బంది, ముస్లిం పెద్దలు, పోలీసు ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## నగర పాలక సంస్థకు విచ్చేసిన అసిస్టెంట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్‌కుమార్


మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్‌కుమార్

అనంతపురం, నవంబర్ 8 ప్రభాతవార్త

మున్సిపల్ పరిపాలన అవగాహనలో భాగంగా శిక్షణలో ఉన్న అసిస్టెంట్ కలెక్టర్ సురపాటి ప్రశాంతకుమార్ మంగళవారం అనంతపురం నగర పాలక సం స్థ కార్యాలయానికి విచ్చేశారు. కమిషనర్ ఛాంబర్‌లో వివిధ విభాగాల అధికారులతో సమావేశమయ్యారు.

నగర పాలక సంస్థలోని వివిధ విభా గాలలో జరిగే కార్యకలాపాలు, అనుసరించే విధి విధానాల నిబంధ నావళిని కమిషనర్ భాగ్యలక్ష్మి, పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరిం చారు. అసిస్టెంట్ కలెక్టర్ వారము రోజులపాటు నగర పాలక సంస్థలోనే ఉండి నగర పాలక ఆధ్వర్యంలో జరిగే అన్ని అంశాలలో అవగాహన, అలాగే పరిపాలన తీరు తెన్నులను పరిశీలించి అవగాహన చేసుకోనున్నట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కమిషనర్ రమణారెడ్డి, ఎస్‌ఈ నాగమోహన్, డిప్యూటీ కమిషనర్ సావిత్రి, కార్యదర్శి సంఘం శ్రీనివాసులు, హెల్త్ ఆఫీసర్ గంగా ధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఆ సమయంలోనే గెజిటెడ్ ఆఫీసర్ కావాలనుకున్నా...!

( మొదటి పేజీ తరువాయి ) అయిన తర్వాత సిఏ చేద్దామనుకుంటుంటే మాకు తెలిసిన ఒక ఆంకుల్ ఐఏఎస్ కోచింగ్ తీసుకోమని చెప్పారు. దీంతో హైదరాబాద్‌లోని ఆర్.సి.రెడ్డి కోచింగ్ సెంటర్‌లో ఐఏఎస్‌కి కోచింగ్ తీసుకుంటుండగా ఆ సమయంలో ఎక్సైజ్ ఎస్ఐ, ఏబీసీడబ్ల్యూవో ఉద్యోగాలకు నోటిఫికేషన్లు వచ్చాయి. మొదట 2007లో ఎక్సైజ్ ఎస్ఐ ఉద్యోగానికి ఎంపికై హైదరాబాద్‌లో ఎక్సైజ్ అకాడమీలో ఆరు నెలలు పని చేయడం జరిగింది. ఆ తర్వాత 2008లో ఏబీసీడబ్ల్యూవో ఉద్యోగానికి ఎంపిక అవ్వడంతో ఆ ఎస్ఐ ఉద్యోగం మానేశాను.

**ప్రశ్న:** మేడమ్ మీరు రెండు ఉద్యోగాలు సాధించినప్పుడు మీ తల్లిదండ్రులు ఏలా ఫీల్ అయ్యారు?

**జవాబు:** చాలా సంతోషపడ్డారు. తన కాళ్ల మీద తనే నిలబడుకుందని ఆనందంలో మునిగిపోయారు.

**ప్రశ్న:** మేడమ్ మీది లవ్ మ్యారేజా, ఆరెంజ్ మ్యారేజా?

**జవాబు:** మాది ఆరెంజ్ మ్యారేజే. మా ఆయన ప్రైవేట్ జాబ్ చేస్తున్నారు. మాకు ఒక బాబు సంతానం. ప్రస్తుతం 9వ తరగతి చదువుతున్నారు.

**ప్రశ్న)** మేడమ్ మీకు మూగ జీవాలంటే భయమా?

**జవాబు:** అవునండి. నాకు మూగ జీవాలంటే చాలా భయం. కానీ అలాంటి మూగ జీవాలకు తన శక్తి కొద్ది ఆహారం పెడుతుంటాను. అలా చేయడంలోనే నాకు చాలా సంతోషంగా ఉంటుంది.

**ప్రశ్న:** మేడమ్ ఎక్సైజ్ ఎస్ఐ ఉద్యోగం ఎందుకు మానేశారు?

**జవాబు:** నాకు 2008లో ఏబీసీడబ్ల్యూవోగా ఉద్యోగం వచ్చింది. ఈ డిపార్ట్‌మెంట్‌లో పేద పిల్లలకు మంచి చేయవచ్చు అనే ఆలోచనతోనే ఎక్సైజ్ ఎస్ఐ ఉద్యోగం మానేసి ఏబీసీడబ్ల్యూవో ఉద్యోగంలో జాయిన్ అయ్యాను.

**ప్రశ్న:** మేడమ్ మీరు ఐఏఎస్‌కి ఏమైనా పరీక్ష రాశారా?

**జవాబు:** అవునండి. నేను రెండు సార్లు ఐఏఎస్‌కి పరీక్ష రాశాను. సెలెక్ట్ కాలేదు. అప్పుడు ఆరు నెలలు మాత్రమే ఐఏఎస్‌కి కోచింగ్ తీసుకున్నాను. అప్పుడే రెండు ఉద్యోగాలకు ఎంపికైయ్యాను.

**ప్రశ్న:** మేడమ్ మీ ఇంట్లో మీరే వంట చేస్తారా?

**జవాబు:** అవునండి. సాయంత్రం ఆఫీస్ నుంచి ఇంటికి వెళ్ళిన తర్వాత నేనే స్వయంగా వంట చేస్తాను. అలా నేను స్వయంగా వంట చేసుకుని తింటేనే మా కుటుంబ సభ్యులకు అందరికి తృప్తిగా ఉంటుంది.

**ప్రశ్న:** మేడమ్ మీరు మొదట ఏబీసీడబ్ల్యూవోగా ఎక్కడ జాయిన్ అయ్యారు?

**జవాబు:** నేను ఏపిపిఎస్‌ఈ ద్వారా ఏబీసీడబ్ల్యూవో ఉద్యోగానికి ఎంపికై రాజమండ్రిలో మొదటి సారి ఉద్యోగంలో చేరాను. 2017లో డీబీసీడబ్ల్యూవోగా పదోన్నతి పొంది విజయనగరం జిల్లాకు బదిలీ అయ్యాను. 2020 సంవత్సరంలో డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి పొంది చిత్తూరు జిల్లాలో డీడీగా పనిచేశానని, ఆ తర్వాత 4-4-2022న ఉమ్మడి అనంతపురం జిల్లా డీడీగా బదిలీ అయ్యాను.

**ప్రశ్న:** మేడమ్ మీ సర్వీసులో మీకు ఇప్పటి వరకు ఏమైనా అవార్డులు వచ్చాయా?

**జవాబు:** ఏబీసీడబ్ల్యూవోగా పనిచేస్తున్నప్పుడు మూడు, డీబీసీడబ్ల్యూవోగా పనిచేస్తున్నప్పుడు ఒకటి, డీడీగా అనంతపురంలో పనిచేస్తున్నప్పుడు ఈ ఏడాది ఆగస్టు 15న ఒకటి మొత్తం ఐదు ఉత్తమ అవార్డు వచ్చాయి.

**ప్రశ్న:** మేడమ్ మీరు హాస్టల్స్ తనిఖీలకు వెళ్ళినప్పుడు విద్యార్థులకు ఏమి చెబుతుంటారు?

**జవాబు:** నేను హాస్టల్స్ తనిఖీలకు వెళ్ళినప్పుడు విద్యార్థులతో బాగా కలిసిపోతాను. విద్యార్థులకు ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని అడిగి తెలుసుకుంటాను. ఏమైనా సమస్యలు నా దృష్టికి తీసుకువస్తే నా పరిధిలోని సమస్యలను అక్కడే పరిష్కారిస్తాను. ఇతర సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాను. ఇలాంటి విద్యార్థులకు మంచి చేయడానికి ఈ ఉద్యోగం తనకు రావడం దేవుడు ఇచ్చిన ఒక గొప్ప వరం.

## ప్రజా సంతృప్తే లక్ష్యంగా సీఎం జగన్ పాలన

### - అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి


లబ్దిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం సిటీ, నవంబర్ 8 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రజలు సంతృప్తి కరంగా ఉండాలన్న లక్ష్యంతోనే ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని 32వ డివిజన్‌లో స్థానిక కార్పోరేటర్ కమల్‌భూషణ్‌తో కలిసి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలకు అందుతున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ స్థాని కుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు డ్రైనేజీలు, పారిశుద్ధ్యంపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి వారికి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనంత వెంకటరా మిరెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. మూడున్నరేళ్ల పాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా సుపరి పాలన నుకొనసాగిస్తున్నారన్నారు. ప్రతి ఇంటికీ నేరుగా సంక్షేమ పథకాలను అంది స్తూ ప్రజా మన్ననలు చూరగొంటున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలతో అన్ని వర్గాల ప్రజలు ఆనందంగా ఉంటుం టే ఓర్వలేని ప్రతిపక్ష పార్టీలు రోజుకొక కుట్రకు, కుతంత్రాలకు తెరలేపు తున్నారన్నారు. ఎవరెన్ని, ఏ పార్టీలు ఎన్ని కుట్రలకు, కుంతంత్రాలకు పాల్పడినా ప్రజా మద్దతు, ప్రజా ఆశీ ర్వాదం ఉన్నంత వరకు ముఖ్యమంత్రి వైఎస్ జగ న్‌మోహన్‌రెడ్డిని అవేమీ చేయలేవని ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిప్యూ టీ మేయర్లు వాస ంతి సాహిత్య, కొగటం విజయ భాస్కర్‌రెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఓబిరెడ్డి, మైనార్టీ నాయీ బ్రాహ్మణ కార్పోరేషన్ డైరెక్టర్లు గౌస్‌బేగ్, శ్రీనివాసులు, కార్పోరేటర్లు సైఫుల్లా బేగ్, సంపంగి రామాంజినేయులు, ఇషాక్, వైసీపీ సీనియర్‌నేత అనంత చంద్రారెడ్డితోపాటు నగరాధ్యక్షులు చింతా సోమశేఖర్‌రెడ్డి, నాయక లు కాగజ్‌ఘర్ రిజ్వాన్, రాజారెడ్డి, సతీష్, నాగార్జునరెడ్డి, పోతులయ్య, ఆర్య కటిక నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## జెసి ప్రభాకర్‌రెడ్డి కలెక్టర్‌కి క్షమాపణ చెప్పాలి

### - అధికారులను బెదిరించడం సరికాదు - రాష్ట్రంలో టిడిపి నేతలు బెదిరించటం అలవాటు చేసుకున్నారు - ఎమ్మెల్సీ శివరామిరెడ్డి డిమాండ్


ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

అనంతపురం, నవంబర్ 8 ప్రభాతవార్త బ్యూరో

తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి జిల్లాకలెక్టర్ నాగలక్ష్మి పట్ల ప్రవర్తించిన తీరు.. మాట్లాడిన మాటలు చాలా క్షమించరానివని ఆయన తీరు అత్యంత గర్హనీయమని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి పత్రికా ముఖంగా వెల్లడించారు. జిల్లా కలెక్టర్ పట్ల జెసి ప్రవర్తించిన తీరు చాలా దుర్మార్గమని దీన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జెసి ప్రభాకర్‌రెడ్డి తన మాటలను వెంటనే వెనక్కి తీసుకుని కలెక్టర్‌కి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే క్షమాపణ చెప్పి తన గౌరవాన్ని కాపాడుకోవాలని జెసిపికి సూచించారు. జిల్లా అధికారులు తమ శక్తి వంచన లేకుండా రాజకీయాలను అతీతంగా పార్టీలకు అతీతంగా పనిచేస్తున్నారని అలాంటి వారి పట్ల కృతజ్ఞత చూపకపోయినా పర్వాలేదు అని అనుచితంగా ప్రవర్తించడం దుర్మార్గమని వెల్లడించారు. సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. అయితే అక్కడ కూడా వాటికి పరిష్కారం రకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకె ళ్లాలి. అంతేకానీ అధికారులను బెదిరించి వారి పట్ల అనుచితంగా ప్రవర్తించి వారిని తమ చెప్పుచేతుల్లో పెట్టుకోవాలన్న ఆలోచన దుర్మార్గం అన్నారు. జిల్లా కలెక్టర్‌గా నాగలక్ష్మి చాలా మంచి పేరు తెచ్చుకున్నారని విధి నిర్వహ ణలో నిస్వార్థంగా ప్రజలకు మంచి సేవలు అందించి ప్రజల మన్ననలను పొందారన్నారు. పార్టీలు, ప్రాంతాలకు అతీతంగా అందరిని కలుపుకుంటూ జిల్లా అభివృద్ధికి కలెక్టర్ సేవలు అందించారన్నారు. అటువంటి ఆమె పై ఇలా ప్రవర్తించడం సరైంది కాదన్నారు. గతంలో కూడా జెసి ప్రభాకర్‌రెడ్డి అధికారులపై అనుచితంగా ప్రవర్తించడం జరి గిందన్నారు. కాబట్టి ఇకనైనా ఇలాంటివి పునరావృ తం కాకుండా జెసి ప్రభాకర్‌రెడ్డి వెంటనే కలెక్టర్‌కి క్షమాపణలు తెలియ జేసి తన గౌరవాన్ని కా పాడుకోవాలని ఎమ్మెల్సీ శివరామిరెడ్డి సూచించారు. ఇటీ వల రాష్ట్ర వ్యా ప్తంగా కూడా తెలుగు దేశం పార్టీ నాయకులు అధికారులను బెదిరించ డాన్ని అలవాటుగా మార్చుకున్నారని పేర్కొన్నారు. టీడీపీ నాయకులు చేస్తు న్న బ్లాక్ మెయిలింగ్ రాజకీయాలను ప్రజలు హర్షించరన్నారు. ప్రజలో ్ల టీడీపీ బలహీన పడటంతో వారు నిరాశ నిస్పృహలకు లోనై ఈ విధంగా రెచ్చి పోతున్నారని ఇది వారి పతనానికి నాంది అని ఎమ్మెల్సీ శివరాంరెడ్డి విమర్శించారు.

## 17 ప్రభుత్వ ఆసుపత్రులకు క్వాలిటీ అస్యూరెన్స్ ధృవీకరణ

### - ప్రధానం చేసిన జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



జాతీయ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్స్ ధృవీకరణ పత్రాలను అందజేస్తున్న కలెక్టర్


ధృవీకరణపత్రాలను అందుకున్న వారితో కలెక్టర్ నాగలక్ష్మి

అనంతపురం, నవంబర్ 8 ప్రభాతవార్త బ్యూరో

ప్రభుత్వ ఆరోగ్య సంస్థల నాన్యత కొలమానంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చే జాతీయ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్స్ ధృవీకరణ పత్రాలను జిల్లాలోని 17 ఆసుపత్రులకు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ప్రధానం చేశారు. వీటిలో గుంతకల్లు ఏరియా ఆసుపత్రి, 16 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. 2019-20, 2020-21, 2021-22 కాలానికిగాను స్వచ్ఛ భారత్ కార్యక్రమం కింద ఆసుపత్రుల పరిశుభ్ర నిర్వహణకు ఇచ్చే కాయకల్స్ అవార్డులను 10 ఆసుపత్రులకు అందించారు. స్థానిక కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాస్థాయి క్వాలిటీ అస్యూరెన్స్ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ అవార్డుల ప్రధానం చేశారు. ఈ సందర్భ ంగాకలెక్టర్ మాట్లాడుతూ.. వచ్చే ఏడాదికి జిల్లా నుంచి అదనంగా కనీసం 20 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 120 వెల్ నెస్ సెంటర్లు క్వాలిటీ అస్యూరెన్స్ ధృవీకరణ పొందేలా చూడాల న్నారు. క్వాలిటీ ధృవీకరణ ద్వారా ఆసుపత్రుల స్థాయిని కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందని, ఆసుపత్రులు మరింత మెరుగయ్యేందుకు అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు.

## పేదవారి ఇళ్ళు జగనన్న సంక్షేమ ఫలాల లోగిళ్ళు

### - ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి


వెంగళమ్మచెరువులో సంక్షేమ ఫలాల ప్రతిని అందజేస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి

పుట్టపర్తి, నవంబర్ 08, ప్రభాతవార్త

ప్రతి పేదవాడి ఇళ్ళు జగనన్న సంక్షేమ ఫలాల లోగిళ్ళు అని పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి అభివర్ణించారు. మంగళవారం నాడు శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గంలోని వెంగళమ్మచెరువు గ్రామంలో గడపగడపకుమన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మహిళలు, సంక్షేమ ఫలాల లబ్ధిదారులు ఆయనకు హారతులు పట్టి తమ గ్రామానికి ఆహ్వానం పలికారు. పుట్టపర్తి రూరల్ వైసిపి కన్వీనర్ నరసారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. గడపగడపకు వెళ్ళి ప్రభుత్వం అందించిన సంక్షేమ ఫలాల పత్రాలను వారికి అందజేశారు. స్థానిక ప్రజా సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకొని సంబంధిత అధికారులతో మాట్లాడి వాటిని సత్వరం పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దుద్దుకుంట మాట్లా డుతూ, ప్రతి పేదవాని ఇళ్ళు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాల లోగిళ్ళు అని అభివర్ణించారు. సిఎం జగన్ తన సుదీర్ఘ పాదయా త్రలో భాగంగాలో ప్రజా సమస్యలను తెలుసుకొని ఇచ్చిన ప్రతి హామీను సుమారు 100 శాతం నెరవేర్చడం జరిగిందన్నారు. దేశ చరిత్రలోనే మరే ఇతర ముఖ్యమంత్రి ఈ విధంగా సంక్షేమ పాలన అందించిన దాఖలాలు లేవన్నారు. అవినీతికి తావు లేకుండా ప్రజా సంక్షేమమే పరమావధిగా ముఖ్యమంత్రి జగన్‌వైసిపి ప్రభుత్వం పని చేస్తోం దన్నారు. ఆయన అడుగు జాడల్లోనే తాము కూడా నడుస్తున్నామ న్నారు. ప్రతి ఇంటికి నేరుగా వెళ్ళి తమ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల పత్రాలను సగ ర్వంగా లబ్ధిదారులకు అంద జేయడం జరుగుతోందన్నారు. నిరుపేద అర్హులకు మేలు జరుగుతుంద ని చెప్పడానికి ఇంతకంటే వేరే ఆధారం కావాలా? అంటూ ప్రశ్నించారు. ప్రతి ఒక్కరూ గుర్తుంచ కొని ముఖ్యమం త్రిగా జగనన్నను, తనను ఎమ్మెల్యేగా మరో మారు ఆశీర్వ దించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిదులు, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే నేటి కార్యక్రమ వివరాలు :** ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీదర్ రెడ్డి 09వ తేది బుధవారం నాడు పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డులో గడపగడప కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ఉదయం 08 గంటలకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, పార్టీ శ్రేణులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## దేశంలో మూడోవంతు అడవి ఉంటేనే పర్యావరణం సమతుల్యం


సమావేశంలో పాల్గొన్న సంబంధిత శాఖల అధికారులు, సేవా సంస్థల ప్రతినిధులు దృశ్యం

( మొదటి పేజీ తరువాయి ) 33 శాతం గ్రీన్ కవర్ పెంచాలంటే కొండలు, గుట్టలు, ప్రస్తుతం ప్రభుత్వం ఇస్తున్న ఇంటి స్థలాలలో ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తున్న భవన నిర్మాణాలలో బంజర భూములలో దేవాదాయ భూములలో మొక్కలు నాటే కార్యక్రమానికి పెద్ద ఎత్తున చర్యలు తసీఉకోవాలన్నారు. అందరి సహకారంతో మొదటి దశలో భాగంగా మూడు వారాలలోపు 40 వేల మొక్కలను వివిధ కళాశాలల విద్యార్థులు మరియు యాజమాన్యాలు, వివిధ సేవా స్వచ్ఛంధ సంస్థల ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. అందుకు సామాజిక అటవీశాఖ ఆధ్వర్యంలో 10 నర్సరీలలో సుమారు 9 లక్షల మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని, డ్వామా ఆధ్వర్యంలో 40 వేల మొక్కలు సిద్ధంగా ఉన్నాయన్నారు. వివిధ పర్యాటక ప్రాంతాలైన లేపాక్షి, పెనుకొండ, హిందూపురం, తిమ్మమ్మ మర్రిమాను, కదిరి ప్రాంతాలలో విరివిగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని టూరిజం అధికారులను ఆదేశించారు. పట్టణంలో రహదారుల ప్రక్కన, ఖాళీ స్థలాలు తదితర ప్రాంతాలలో అందరి సహకారంతో మహాయజ్ఞంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు 1/3వ వంతు పూర్తయ్యాయని, జనవరి నాటికి భవనాలు పూర్తవుతాయని, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, డిజిటల్ లైబ్రరీలు, వైఎస్ఆర్ హెల్త్‌క్లీనిక్, బిఎంసియు/ఎఎంసియు భవనాల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతు న్నాయన్నారు. అనంతరం సోషల్ ఫారెస్ట్ అధికారిణి శ్యామల మాట్లాడుతూ, జిల్లాలోని వివిధ నర్సరీల యందు చింత, నేరేడు, వేప, ఉసిరి, టేకు, యొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డ్వామా పిడి రామాంజినేయులు, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ప్రతినిధి కె.చలం, ఆర్‌డిటి సంస్థ ప్రతినిధి నాగేశ్వర్ రెడ్డి, వ్యవసాయ శాఖ జెడి సుబ్బారావు, డి.ఆర్‌డిఎ పిడి నరసయ్య, ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్, సెరికల్చర్ జెడి ప్రభావతమ్మ, బ్రహ్మకుమారి సంస్థ ప్రతినిధి లక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ రషీద్, పెనుకొండ మున్సిపల్ కమీసనర్ వంశి, పుట్టపర్తి మున్సిపల్ కమీషనర్ వెంకటేశ్వర్ రెడ్డి, టూరిజం అధికారి నాగేశ్వర్ రెడ్డి, ఎండోమెట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.